క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం లైన్ల నిర్వహణ నిమిత్తం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చిత్తూరు నియోజకవర్గం, పెనుమూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు, పాలసముద్రం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు మార్పును గమనించాల్సిందిగా కోరారు.

నేడు వాహనాల వేలం

బంగారుపాళెం: అక్రమ మద్యం కేసులో సీజ్ చేసిన వాహనాలను శనివారం వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తున్న కేసులో పట్టుబడిన 9 ద్విచక్రవాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటలకు చిత్తూరు ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

బండికి ఫిట్‌నెస్ అవసరం



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎంవీఐలు

చిత్తూరు రూరల్: వాహనాలకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని ఎంవీఐ రాజేశ్వరరావు అన్నారు. చిత్తూరు నగరంలోని డీటీసీ కార్యాలయంలో శుక్రవారం పలు వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించి వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వాహనాలకు ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ చేయించుకోవాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడిపితే కేసులు ఉంటాయన్నారు. అందరూ అవగాహన కలిగి నిర్ణీత సమయంలో బండి కండీషన్‌తో పాటు ట్యాక్స్ చెల్లించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

బడికి అగ్ని మాపక పరికరాలు



యాదమరి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం అగ్ని మాపక పరికరాలను పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా మండల కేంద్రంలోని పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆ పరికరాలను ఎంఆర్‌సీ సిబ్బంది శుక్రవారం అందించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

బంగారుపాళెం: స్థానిక ఎన్‌పీసీ నాయుడు పార్కులో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు వెంకటేశ్వరచౌదరి తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని కంటి జబ్బు రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చిత్తూరు అర్బన్: నగరంలో పేకాడుతున్న 14 మందిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ నరసింహరాజు కథనం మేరకు, ప్రభుత్వ ఆస్పత్రి పక్కనున్న ఓ భవనంలో పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అక్కడకు వెళ్లి తనిఖీలు నిర్వహించగా పేకాడుతున్న 14 మంది నిందితులను అరెస్టు చేసి, రూ.6800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

12న చిత్తూరు- కాణిపాకం పాదయాత్ర

చిత్తూరు కలెక్టరేట్ : సిద్ధ సమాధి యోగా చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12న పాదయాత్ర నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాదయాత్ర ఆదివారం ఉదయం 6.30 గంటలకు స్థానిక విజయం డిగ్రీ కళాశాల నుంచి కాణిపాకం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మానవ సంక్షేమం, ఆరోగ్యం, ప్రపంచశాంతిని కోరుతూ సిద్ధ సమాధి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

అతివల ఆర్థికాభివృద్ధికి బాసట

స్వయం సహాయక సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మహిళా సమాఖ్య చర్యలు చేపడుతోంది. జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటు కోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహిస్తోంది. వీటి నిర్వహణతో ఆదాయాన్ని ఎలా పెంపొందించుకోవాలో అవగాహన కల్పిస్తోంది. మహిళాభ్యుదయానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మహిళా సమాఖ్య గ్రామాల్లోని మహిళలకు చేయూతనందిస్తోంది.





జిల్లా సమాఖ్య ఆవరణలో పెంచుతున్న నాటుకోళ్లు

- జిల్లా సమాఖ్య ఆవరణలో నాటు కోళ్ల పెంపకం
- మార్ట్ ఏర్పాటుతో మరింత ఆదాయం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటుకోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహణతో మంచి ఆదాయం వస్తోంది. జిల్లాలోని డ్వాక్రా మహిళా సంఘాల నిర్వహణకు వీలుగా గ్రామ, మండల, జిల్లా స్థాయి సమాఖ్య సంఘాలను ఏర్పాటు చేశారు. ప్రతి స్థాయి సంఘాల మేరకు అధ్యక్ష, కార్యదర్శులతో కూడిన కార్యవర్గాన్ని మహిళలను ఏర్పాటు చేసుకుని సంఘాలను పటిష్టంగా నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయి మహిళా సమాఖ్య నిర్వహణకు చిత్తూరులో భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో నెలవారీ జిల్లా స్థాయి సమావేశాలతో పాటు, సంఘాల నిర్వహణపై ఎప్పటికప్పుడు మహిళలకు శిక్షణ కూడా ఇస్తున్నారు. ఈ భవనంలో సంఘాల నిర్వహణకు అవసరమైన సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బందికి జీత భత్యాలు, భవనం నిర్వహణ తదితర ఖర్చులను జిల్లా సమాఖ్య నుంచి వెచ్చిస్తున్నారు. జిల్లా సమాఖ్య నిర్వహణకు అవసరమైన నిధులను మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లా సమాఖ్య భవనం ఆవరణలో నాటుకోళ్ల పెంపకం, మార్ట్ నిర్వహణ తదితరాలు చేపడుతున్నారు. వీటి నుంచి వచ్చే ఆదాయంతో జిల్లా సమాఖ్య భవనం నిర్వహణ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు.

తక్కువ ధరకు నాటు కోళ్లు

జిల్లా సమాఖ్య భవనం వద్ద నెల రోజుల కిందట మహిళా సమాఖ్య సభ్యులు నాటు కోళ్ల పెంపకాన్ని ప్రారంభించింది. చిన్నపాటి షెడ్డు ఏర్పాటు చేసి ప్రస్తుతం 100 నాటు కోళ్లతో పాటు, గిన్ని కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లను కూడా పెంచుతోంది. కోడి పిల్లలను తీసుకువచ్చి షెడ్లలో ఉంచి డ్రింకర్లు, ఫీడర్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మేత, నీరు అందించి ఆరోగ్యకరమైన వాతావరణంలో పెంచుతున్నారు. కోళ్లను, గుడ్లను ప్రైవేటు మార్కెట్ కన్నా తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. దీంతో నగరవాసులు అధికంగా జిల్లా సమాఖ్య వద్ద కోళ్లను కొనుగోలు చేస్తున్నారు.

మార్ట్‌లో 150 రకాల వస్తువులు

డ్వాక్రా మహిళలు తయారు చేసే వస్తువులు, పండించే పంటలను విక్రయించే విధంగా జిల్లా సమాఖ్య ఆవరణలో మహిళా సభ్యులు మార్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మార్ట్‌లో నిత్యావసర సరుకులు, డ్రై ఫ్రూట్స్, చిరుధాన్యాలు, ప్రకృతి వ్యవసాయంతో తయారు చేసిన బెల్లం, నల్లబియ్యం తదితరాలను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఉత్పత్తులను రైతుల నుంచి సేకరించి, వాటిని శుభ్రపరచి మార్ట్‌లో విక్రయించి పరోక్షంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. దీంతోపాటు డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులు బ్యాగులు, టెర్రకోట బొమ్మలు, కొయ్య బొమ్మలు, గిరిజనుల నుంచి సేకరించిన వివిధ రకాల ఉత్పత్తులు, తేనె, సోపులు, షాంపులు, తినుబండారాలు తదిరాలు మొత్తం 150 రకాల వస్తువులు మార్కెట్ ధరకంటే తక్కువకు విక్రయిస్తున్నారు. ధరలు అందుబాటులో ఉండడంతో విక్రయాలు క్రమంగా ఊపందుకుంటున్నాయి. టర్నోవర్ కూడా పెరుగుతుండడంతో మహిళా సమాఖ్య ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది.



జిల్లా మహిళా సమాఖ్య నడుపుతున్న మార్ట్

మహిళల్లో చైతన్యమే లక్ష్యం



స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆర్థికాభివృద్ధిపై చైతన్యం తేవడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో పెరటికోళ్ల పెంపకం చేపట్టడం వల్ల వచ్చే ఆదాయాన్ని మహిళలకు తెలియజేయడం. ప్రకృతి వ్యవసాయంతో దిగుబడి అయ్యే ఉత్పత్తులు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవనాన్ని తెలపడం కోసం మోడల్‌గా కోళ్ల పెంపకం, మార్ట్‌ను నిర్వహిస్తున్నాం. తద్వారా వచ్చే ఆదాయాన్ని జిల్లా సమాఖ్య నిర్వహణకు వెచ్చిస్తున్నాం.

– తులసి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్

వేధింపులు మానుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్ : తనిఖీల పేరుతో టీచర్లపై అధికారుల వేధింపులు మానుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం ఆ సంఘ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. రమణ మాట్లాడుతూ వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో పాఠశాలల తనిఖీ పేరుతో అధికారులు టీచర్లను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. షోకాజ్ నోటీసుల పేరుతో టీచర్లను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వం పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల ఇళ్లలో తనిఖీలు



పూతలపట్టు: మండలంలోని ఎం.బండపల్లిలో పాత నేరస్తుల ఇళ్లల్లో పోలీసులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. మూడు బృందాలుగా పోలీసులు పలు ఇళ్లలో తనిఖీలు చేయగా ఎస్‌ఐ హరిప్రసాద్ నేరస్తుల వివరాలపై ఆరా తీశారు. పలువురికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది మనోహర్, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

చిత్తూరు రూరల్: మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించాలని సత్యసాయిసేవా సమితి నిర్వాహకులు మధుసూదనం అన్నారు. చిత్తూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వారు శుక్రవారం మొక్కలు నాటి నీరుపోసి, పూజలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు గజేంద్ర, దేవరాజులు, విశ్వనాథం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఐరాల: చిన్నారులు మంచి పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇంటి వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో జ్వరం, జలుబు, దగ్గు వంటి జబ్బులున్న చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. చిన్న పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పాలకల రెడ్డివారిపల్లెలో రోగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

189 కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

గుడిపాల: మండలంలోని 189కొత్తపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి కఠారి కుమార్ 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునీత, సిబ్బంది హరిప్రియ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కఠారి కుమార్

నేడు పాపసముద్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్

గుడిపాల: మండలంలోని పాపసముద్రంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి సుకన్య తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వైద్యసేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గర్భిణులు, బీపీ, షుగర్ పేషెంట్లు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చిన రోగులందరికీ ఉచితంగా మందులను అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు ఓటర్లకు అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ మీడియా ఇన్‌చార్జి రామభద్ర తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక కొంగారెడ్డిపల్లెలోని ఓ హోటల్లో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు వస్తారని చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసుల రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు ఉన్నాయా లేదా అని ఆరా తీశారు. పోలింగ్ రోజు యాదమరిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సుమన్ తదితరులు ఉన్నారు.

నేడు కుంభాభిషేక మహోత్సవం

చిత్తూరు రూరల్: శివ షణ్ముగ సుందర వినాయక స్వామి ఆలయంలో శనివారం కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ వి కణ్ణన్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు నగరం బజారు వీధిలో వెలసిన శివ షణ్ముగ సుందర వినాయకస్వామి మహాకుంభాభిషేక వార్షికోత్సవం శనివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. 9 నుంచి 10 గంటల వరకు వినాయకస్వామి వారికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల అన్నదానం, సాయంత్రం స్వామి పల్లకీ సేవ వైభవంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవో తిమ్మారెడ్డి, కమిటీ సభ్యులు విజయరాఘవన్ శ్రీధర్, పుష్పలత, రాజేంద్రబాబు, కళావతి, మణిగండన్ మణి శెట్టియార్, రాము, అంబిక, వరలక్ష్మీ, అర్చకులు శ్రీధర్ అయ్యర్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ నిర్వాహకులు

డీఎంహెచ్‌ఓ తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

చిత్తూరు రూరల్: వైద్య శాఖ ఉద్యోగుల పట్ల డీఎంహెచ్‌ఓ వ్యవహరిస్తున్న తీరు కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు నగరంలో వైద్య ఆరోగ్యశాఖ యూనియన్ నాయకులు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. డీఎంహెచ్‌ఓకు విధి విధానాలపై సరైన అవగాహన లేదన్నారు. దీంతో ఆయన రోజుకో నిబంధన పేరుతో ఉద్యోగులను, సిబ్బంది వేధిస్తున్నారని ఆరోపించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడిన తీరుతో ఇటీవల ఓ మహిళా ఉద్యోగి ఆయన చాంబర్‌లోనే కళ్లు తిరిగి పడిపోయిందని చెప్పారు. కిందిస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు డీఎంహెచ్‌వో వేధింపులతో విసిగిపోయారని పేర్కొన్నారు. ఆయన ఇష్టారాజ్యంగా డీపీఎంఓ, ఎస్‌ఓ, ఏఓ, డీఐఓలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు 40 మందికి నోటీసులు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డీఎంహెచ్‌వో పనితీరు సక్రమంగా లేదని గత నెల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. కనీసం ఆయనకు సీసీగా పనిచేసేందుకు కూడా ఎవరు ముందుకు రావడం లేదని తెలిపారు. కార్యాలయంలో పనులు మందగమనంలో సాగుతున్నాయని దీనికి ఆయన తీరే కారణమని ఆరోపించారు. ఆయన తీరు మార్చుకోని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవిరాజు, లక్ష్మీనారాయణ, రవికుమార్, శ్రీనివాసమూర్తి, శివయ్య తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పకడ్బందీగా నులిపురుగుల నిర్మూలన







చిత్తూరు: ఏఎన్‌ఎంలకు మాత్రలు పంపిణీ చేస్తున్న కమిషనర్ అరుణ, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఐరాల: మాత్రలను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి పూర్ణలత, పూతలపట్టు: మాత్రలు పంపిణీచేస్తున్న ఎంపీడీఓ గౌరి

చిత్తూరు అర్బన్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలని నగర కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. నేషనల్ డీ వార్మింగ్ డే కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం నగరపాలక కార్యాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పిల్లల కడుపులోని నులిపురుగులను నివారించడం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని కాపాడవచ్చని చెప్పారు. ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు పంపిణీ చేయాలన్నారు. అందుకోసం అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలో తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. మాత్రలను వినియోగించడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించాలని, స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ప్రజారోగ్య విభాగం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పాఠశాలలకు అవసరమైన మందులను సంబంధిత ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలకు పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపీడీవో రాఘవేంద్ర వర్మ, ఎంహెచ్‌వో డా.లోకేష్, ప్రజారోగ్య విభాగం అధికారులు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం

ఐరాల: విద్యార్థుల్లో రక్తహీనతను నివారించడానికి ఈ నెల 14 నుంచి జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత తెలిపారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖతోపాటు మండల పరిషత్, సీడీఎస్, విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రలను విద్యాశాఖ, అంగన్‌వాడీ సిబ్బందికి పంపిణీ చేశారు.

పూతలపట్టు: మండల కేంద్రంలో నులిపురుగుల వ్యాధి నివారణ మాత్రలను ఎంపీడీఓ గౌరి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోనూ నులిపురుగుల వ్యాధి నివారణ మాత్రలను విధిగా అందించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నూర్జహాన్, శేషాద్రి, సింధు పాల్గొన్నారు.

క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట హసాన్‌పురం గ్రామంలో శుక్రవారం వేము కళాశాల ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎస్వీ కేర్ ఆస్పతి వైద్యులు చికిత్స నిర్వహించగా మొత్తం 72 మందికి చికిత్స చేసి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మాజరాణి, ఎంపీటీసీ నాగరాజ, వైద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రామాల్లో విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఐరాల: పూతలపట్టు నియోజకవర్గంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ప్రచారం విస్తృతంగా సాగింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులైన పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన వారికి బ్యాలెట్ నమూనా పత్రాలు అందజేసి తొలి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పులు అందజేత

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లె, చెర్లోపల్లె, తొడతర, గాజులపల్లె తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలసి బ్యాలెట్ నమూనా పత్రాలను అందజేశారు. మండలంలో సుమారు 1600 మంది ఓటర్లకు స్లిప్పులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో మండల పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు మధుకుమార్, సాయి రెడ్డి, కోదండ, మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ డేవిడ్, దినేష్‌రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.





ఐరాల: ప్రచారంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, యాదమరి: కరపత్రాలు పంచుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ ధనంజయరెడ్డి

ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్

యాదమరి: మండలంలోని పలు గ్రామాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి గెలుపుకోసం జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యాదమరి, 184 గొల్లపల్లె, దాసరాపల్లెలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, నాయకులు మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

చిత్తూరు రూరల్: మండలంలో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రచారం చేశారు. జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు, వైస్ ఎంపీపీ రజని, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, నాయకులు త్యాగరాజులు, సంపత్ బాబు, కుమార్, రాబర్ట్ పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని పల్లూరు, చింతగుంటూరు, గొల్లమడుగు, బొమ్మసముద్రం గ్రామాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, వరదరాజులు రెడ్డి, రజిని, బాబయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.